
# ✱ బిరుదులు ✱

సీతారాం దగ్గరికి మోహన్రావ్ పరుగునవచ్చి అతని ఎదురుగా నిల్చుని స్పీడుగా ఊపిరి పీల్చి వదలసాగాడు. "మరే... మరే... నీకో విషయం చెప్పాలి!" అన్నాడు మధ్య మధ్య ఊపిరి ఆపి ఆయాసపడ్తూ




సీతారాం టేబులుమీద కాగితాలు రివ్వున ఎగిరిపోసాగాయ్.

సీతారాం నెత్తికొట్టుకుని "ఒరేయ్ రాములూ... కాస్త ఫాను స్పీడు తగ్గించు... గాలికి కాగితాలన్నీ ఎగిరిపోతున్నాయ్..." అన్నాడు డిపార్టుమెంటు ప్యూనుతో.

మోహన్రావ్ కిసుక్కున నవ్వాడు... "నీ కాగితాలేం ఫానుగాలివల్ల ఎగర్లేదుగా!"

"మరి?..." ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు సీతారాం.

"నేనాయాసపడ్తూ ఊపిరి స్పీడ్‌గా తీస్తున్నాగా... అందుకని నీ కాగితాలన్నీ ఎగిరిపోతున్నాయ్..." ఆయాసపడ్తూ చెప్పి హిహి అని నవ్వి మళ్లీ ఆయాసపడ్తూ సిగ్గుపడ్డాడు మోహన్రావ్. సీతారాం నెత్తికొట్టుకొని లబోదిబో అన్నాడు.

"నీ ఆయాసపడ్డం పాడుగానూ... నా కాగితాలన్నీ ఎగిరిపోతున్నాయ్

కదోయ్... ముందటు తిరుగు..." మోహన్రావ్ మీద కసురుకున్నాడు సీతారాం.

మోహన్రావ్ అటువైపు తిరిగి నిల్చుని సీతారాం అవస్థని తల్చుకుని కిసకిసా నవ్వాడు.

సీతారాం కిందపడిన కాగితాలన్నీ ఏరి టేబులుమీద సర్ది "నీ అయాసం తగ్గిందా?" అని మోహన్రావ్‌ని అడిగాడు. మోహన్రావ్ తగ్గిందన్నట్లు తల ఊపాడు.

"అయితే ఇటు తిరుగు" మోహన్రావ్ సీతారాం వైపుకి తిరిగి నిల్చున్నాడు.

"ఎందుకంతిదిగా అయాసపడి పోతున్నావ్?" అతన్ని అడిగాడు సీతారాం.

"మరేమో నీకో విషయం చెప్పాలని పరుగెత్తుకు వచ్చాగా... అందుకే అయాసపడ్డా..." చెప్పాడు మోహన్రావ్.

"ఏంటా విషయం?"

"అకౌంట్స్ డిపార్టుమెంటులోని సింగినాధం శ్రీ హార్టెటాక్‌తో పోయాట్ట!! ఇప్పుడే ఆ డిపార్టుమెంటుకి వెళ్తే. చెప్పారు..."

"సింగినాధం శ్రీ ఎవరూ?" ఆశ్చర్యకరంగా అడిగాడు సీతారాం.

"అదే... ఆ డిపార్టుమెంట్లో సూపరింటెండెంట్ లేడూ... అతను..."

"అతని పేరు వెంకట్రావుగా ... సింగినాధం శ్రీ అని కొత్త పేరేదో చెప్తావేం?"

"వెంకట్రావన్నది అతని పేరే కానీ సింగినాధం శ్రీ అన్నది అతనికి బిరుదు... ఆ విషయం నీకు తెలీదా?"

"తెలీదే!... అతనికా బిరుదు ఎవరిచ్చారు?"

"పన్లేని పాపారావు అనీ ఒకాయనున్నాడు. అతను ఒక అసోసియేషన్ పెట్టి అందరికీ బిరుదులిస్తుంటాడు... మన వెంకట్రావుకి కూడా అతనే రవీంద్రభారతిలో దండేసి ఆ బిరుదిచ్చాడు ..." చెప్పాడు మోహన్రావు.

మోహన్రావ్ చెప్పిన విషయం విని కాస్సేపు సీలింగ్ వంక చూసి హఠాత్తుగా ముక్కు పొంగించి "వా..." అని జుట్టు పీక్కుంటూ ఏడవడం మొదలుపెట్టాడు సీతారాం.

మోహన్రావ్ ఒక్క క్షణం కంగారుపడిపోయి ఆ తర్వాత తమాయించుకొని తన చేతుల్తో సీతారాం నోరు మూసేశాడు.

"అప్పుడే అలా ఏడుస్తావేం?... మధ్యాహ్నం ఒంటిగంటకి కండోలెన్స్ మీటింగుంది... అప్పుడేడుద్దువు గాని" అని కోప్పడ్డాడు. సీతారాం తలూపి కళ్లు తుడుచుకున్నాడు.

"సరేగాని... కండోలెన్స్ మీటింగు ఎవరు ఎరేంజ్ చేస్తున్నారు?..." అడిగాడు సీతారాం కాస్త తెప్పరిల్లాక.

"పుస్తక సామ్రాట్ చేస్తున్నాడు.

"వాడెవడు?" అదిరిపడ్డాడు సీతారాం.

"అలా అడుగుతావేం?... నీకు ఆఫీసులో ఎవరెవరున్నారూ వాళ్ళేమి చేస్తున్నారూ అన్న జ్ఞానం బొత్తిగా లేనట్టుందే... ప్లానింగ్ డిపార్టుమెంట్లోని కాంతారావు లేడూ... వాడికి పుస్తక సామ్రాట్ అనే బిరుదును పోయినవారం త్యాగరాయ గానసభలో ఇచ్చారు.."

"ఎవరూ?!"

"ఇంకెవరూ... ఇందాక చెప్పానే పన్లేని పాపారావనీ... అతనే ఇచ్చాడు."

"నాకు తెల్సినంత వరకూ అతను పుస్తకాలేమీ రాయలేదే? మరి పుస్తక సామ్రాట్ అనే బిరుదు నెందుకిచ్చా రబ్బా!" బుర్రకాయ గోక్కుంటూ ఆశ్చర్యంగా అడిగాడు సీతారాం.

"అతను పుస్తకాలు రాయకపోయినా పుస్తకా లెక్కువ చదువుతాడు... బిరుదివ్వడానికి ఆ మాత్రం కారణం చాల్దా?..." విసుక్కుంటూ అన్నాడు మోహన్రావ్.

ఒంటిగంటకి సింగినాథం శ్రీ మరణించిన సందర్భంగా కండొలెన్స్ మీటింగ్ పెట్టారు. ఆ మీటింగ్‌లో సీతారాం భోరున ఏడ్చాడు. అతని ఏడుపుచూసి అక్కడి జనాలకి కడుపు తరుక్కుపోయింది. సింగినాథం శ్రీ పోయినదానికంటే సీతారాం బాధచూసి కళ్లనీళ్లు పెట్టుకున్నవాళ్లే ఎక్కువున్నారు.

అందరూ చాల కష్టపడి ఎంతో శ్రమ తీస్కుని సీతారాంను ఓదార్చారు. ఏడ్చి ఏడ్చి సీతారాం కళ్లు ఎర్రగా ఉబ్బిపోయినయ్.

"ఇంకా నువ్వేం పన్జేస్తావోయ్... ఈవేళ్టికి ఇంటికెళ్ళిపో..." సీతారాం ఆఫీసరు అతన్ని జాలిగాచూస్తూ పర్మిషనిచ్చేశాడు. సీతారాం ఇంటికెళ్లి భార్య నాగమణిని గట్టిగా కౌగలించుకుని భోరున ఏడ్చాడు.

"ఏమిటండి... ఏమైందీ?... మిమ్మల్ని ఉద్యోగంలోంచి పీకేశారా?" కంగారుగా భర్తని అడిగింది నాగమణి అతని కౌగిలినుండి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

"మా ఆఫీస్లో వెంకట్రావు లేడూ... వాడు ఈవేళ హార్టెటాక్‌తో పోయాడు... వా..." మరింత గట్టిగా కౌగిలించుకుంటూ ఏడ్చాడు

సీతారాం.

నాగమణి ఆశ్చర్యపోతూ అడిగింది. "వాడు చస్తే మొహం అంతా ఉబ్బిపోయేలా అలా ఏడుస్తున్నారేం... వాడంటే మీకు అస్సలు పడదని నాతో చాలాసార్లు చెప్పారేం?"

"నేను ఏడుస్తుంది వాడు పోయినందుకు కాదు... వాడికి సింగినాథం శ్రీ అనే బిరుదిచ్చారు... వా... అంతేకాదు - మా ఆఫీసులో కాంతారావు అనే వాడికి పుస్తక సామ్రాట్ అనే బిరుదిచ్చారు... వా... ఇద్దరికీ పన్లేని పాపారావే అతనే ఇచ్చాడట! వహ్వో... నాకే బిరుదూ లేదు... వా.."

"అలా ఏడవకపోతే మీరు కూడా పన్లేని పాపారావు దగ్గరకెళ్ళి మీక్కూడా ఏదైనా బిరుదివ్వమని అడక్కూడదూ?" విసుక్కుంది నాగమణి.

ఆ మాట వింటూనే సీతారాం భార్యని వదిలిపెట్టి సంతోషంగా నవ్వాడు. "హిహిహి.." అతని కన్నీళ్లన్నీ ఆనంద బాష్పాలైపోయాయ్.

"సర్లేగానీ.. ఏంటలా వంకరగా నిల్చున్నావ్?" నవ్వడం ఆపి భార్యని పరిశీలనగా చూస్తూ అడిగాడు సీతారాం.

నాగమణి నెత్తి కొట్టుకుంది.

"ఆళ్లెవరికో బిరుదు నా ఖర్మకై వచ్చింది... ఏడ్చేవాళ్లు అంత గట్టిగా పట్టుకుని ఏడ్వాలా... మీ పట్టుమంటెట్టా... నాకు నడ్డిరుకు పట్టింది.."

సీతారాం నాలుక కొరుక్కుని "హిహిహి" అని సిగ్గు పడుతూ నవ్వాడు.

ఆ వేళ సాయంత్రం సీతారాం పన్లేని పాపారావు ఇంటికి వెళ్లాడు.

సీతారాం బాధ విన్న పన్లేని పాపారావు తేలిగ్గా నవ్వేశాడు. "హోస్... ఇంతేనా?... మీ మొహంచూసి ఎవరైనా చావుబతుకుల్లో ఉన్నారేమోనని అనుకున్నా... మీలాంటి వారి బాధల్ని తీర్చడానికే కదా నేనున్నాను?... ఆ ... హిహిహి" అన్నాడు.

అయితే నాకేదైనా బిరుదు మీ సంస్థ తరపున ఇస్తారా?.." ఆశగా అడిగాడు సీతారాం.

"ఓ... అలాగే! సరేగానీ నువ్వు కవితలుగానీ రాస్తావా?... 'కవిసింహం' అనే బిరుదు ఇచ్చేస్తా..." అన్నాడు పాపారావు.

"లేదండీ.." తల అడ్డంగా ఊపాడు సీతారాం.

"పోనీ నవలలు రాస్తావా?"... 'నవనవలా సార్వభౌమ' అనే బిరుదిచ్చేస్తా.."

"అబ్బే... అది కూడా చెయ్యనండీ.."

"మరి నీకేంచేతనవును?"

"ఏమీరాదండి.." సిగ్గుపడ్తూ అన్నాడు సీతారాం.

"పోనీ బాగా తింటావా?" పన్లేని పాపారావు సీతారాం మొహంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"ఓ.. ఎవరైనా భోజనానికి పిలిచి వడ్డించాలేకాని కుంచాలకి కుంచాలు లాగించేస్తానండీ!" హుషారుగా అన్నాడు సీతారాం.

"మరి ఏం చేతకాదంటావేం?... ఆ మాత్రం చాలు!... నువ్వెప్పుడైనా విన్నావా – తిండికి తిమ్మరాజూ పనికి పోతరాజూ అని అంటుంటారు?"

"విన్నానండీ.." ఆనందంగా తల ఊగిస్తూ అన్నాడు సీతారాం.

"నీకు అభినవ తిమ్మరాజు అనే బిరుదుని ప్రసాదిస్తాం.. ఇష్టమేనా?" అడిగాడు పన్లేని పాపారావు.

"ఇష్టమేనండి.. నాకా బిరుదు ఎప్పుడిస్తారండి?.." హుషారుగా అడిగాడు సీతారాం.

"నీదే ఆలస్యం... ఇన్విటేషన్లు ప్రింట్ చెయ్యడానికీ హాలు బుక్ చెయ్యడానికి వాటికీ వీటికీ అయ్యే ఖర్చులన్నీ పెట్టుకుని ఇవన్నీ అరేంజ్ చేస్తున్నందుకు నాకో రెండువేలు పారేస్తే నీకు తిమ్మరాజు బిరుదిచ్చేస్తాం... అన్ని పత్రికల్లో నీకు బిరుదిచ్చిన న్యూస్‌ని వేయిస్తాం.."

"అలాగేనండీ..." సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ అన్నాడు సీతారాం.

"అన్ని ఖర్చులూ మొత్తం ముందే ఇచ్చెయ్యాలి! లేకపోతే రేపొద్దున బిరుదు తీసుకున్నాక డబ్బు ఎగ్గొడితే ఇంకేమైనా ఉందా?... హమ్మో..." గుండెలమీద చెయ్యేసుకుంటూ అన్నాడు పాపారావు.

"హప్పుడు ఎగవేత సామ్రాట్ అని బిరుదివ్వొచ్చు కదండీ... హిహిహి" మెలికలు తిరుగుతూ అన్నాడు సీతారాం.

"ఒక్క బిరుదే దండగనుకుంటే రెండేసి బిరుదులు కావాలేం...అదేం కుదర్దు... డబ్బంతా ముందే ఇచ్చెయ్యాలి!"

"మీ ఫీజు కాస్త తగ్గించుకుంటే... హిహి... ఏమంటారు?" బుర్ర గోక్కుంటూ నసిగాడు సీతారాం.

"నువ్వు డబ్బుండే వాడివి కాదు కాబట్టి రెండువేలే ఛార్జ్ చేశాను.. అదే డబ్బుండే వాళ్లయితే పదేసి ఇరవయ్యేసి వేలు పారేసి బిరుదులు

ఇప్పించేస్కుంటుంటారు.. తెల్సా..." మొహం చిట్లించి అన్నాడు పన్లేని పాపారావు.

"సర్లెండి... మీ ఇష్టం వచ్చినట్టే కానివ్వండి..." అన్నాడు సీతారాం.

"నువ్వెళ్ళి రేపు డబ్బులు తీస్కురా... వచ్చే వారమే నీకు బిరుదిచ్చేస్తా.."

"అలాగే సార్..."

సీతారాం హుషారుగా ఇంటివైపు అడుగులు వేశాడు.

* * *